# ధనలక్ష్మి చేసిన నేరం

అకస్మాత్తుగా అభిరాముడు కుబేరుడయాడు. గుడిసె పీకేసి భవంతి లేపాడు. ఇనప్పెట్టె కొని దాని నిండా బంగారం పేర్చాడు. మహారాజుకన్న ఘనంగా బతుకుతున్నాడు.

కారణం ఏమై ఉంటుంది? మహారాజు మంత్రులతో ఆలోచించాడు. నిధి దొరికిందా? పరుసవేది సంపాదించాడా? పెద్దఎత్తున దార్లుగాని కొట్టాడా! కారణం ఏదైనా విచారించవలసిన బాధ్యత రాజుమీద ఉన్నది.

మహారాజు అకస్మాత్తుగా తన ఇంటికి రావటం చూసి అభిరాముడు ఆనందించాలో, ఆశ్చర్యపడాలో, భయపడాలో తేల్చుకోలేక ఉక్కిరి బిక్కిరి అయాడు.

“నీ ఇనప్పెట్టె తీసి చూపించు,” అన్నాడు రాజు.

అభిరాముడు తీసి చూపించాడు. లోపల బంగారు మొహర్లున్నాయి అన్నీ రాజుగారి టంకసాలలో గుద్దినవే!

“ఇది దొంగసొమ్ము!” అన్నాడు రాజు.

“కాదు, మహారాజా! లక్ష్మి కటాక్షం! ఏకాది లక్ష్మి పూజచేసి, ఆమె అనుగ్రహం సంపాదించాను.”

“అయితే, చోరీ నేరం లక్ష్మీదేవిది. ఆమెను పట్టి ఇచ్చేశక్తి నీకున్నది గదా! అందాకా నువు జైల్లో ఉండు,” అన్నాడు మహారాజు.

---

కొడవటిగంటి కుటుంబరావు

---